క్లుప్తంగా

ప్రభుత్వ భవనాల ప్రారంభోత్సవం



సచివాలయ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మానుగుంట మహీధర్‌రెడ్డి

ఉలవపాడు: మండల పరిధిలోని కరేడు పంచాయతీలోని పలు ప్రభుత్వ భవనాలను కందుకూరు ఎమ్మెల్యే మానుగుంట మహీధర్‌రెడ్డి ఆదివారం ప్రారంభించారు. కరేడు ఒకటో సచివాలయ పరిధిలోని రైతు భరోసా కేంద్రాన్ని, కరేడు మూడో సచివాలయ పరిధిలోని సచివాలయ భవనం, రైతు భరోసా కేంద్రాలను ఆయన ప్రారంభించారు. ముందుగా రిబ్బన్ కట్ చేసి ప్రారంభించిన అనంతరం శిలాఫలకాలను ఆవిష్కరించారు. ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ వాయల మస్తానమ్మ, జెడ్పీటీసీ చేవూరి అరుణ, సర్పంచ్ వెంకటేశ్వర్లు, మండల కన్వీనర్ పోతురాజు, పంచాయతీయ ఏఈ కోటేశ్వరరావు, సచివాలయ సిబ్బంది, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పిల్లలు పుస్తక పఠనం అలవర్చుకోవాలి



గ్రంథాలయంలో చదవడం మాకిష్టం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న గ్రంథపాలకుడు

ఉలవపాడు: పిల్లలు చిన్నతనం నుంచే పుస్తక పఠనం అలవాటు చేసుకోవాలని గ్రంథపాలకుడు దాసరి కోటేశ్వరరావు తెలిపారు. స్థానిక గ్రంథాలయంలో ఆదివారం చదవడం మాకిష్టం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులతో మాట్లాడుతూ విద్యార్థులు చదవడంతో పాటు రాయడం తప్పనిసరిగా నేర్చుకోవాలన్నారు. గ్రంథాలయాలకు వచ్చి పుస్తకాలను చదవడం అలవాటు చేసుకోవాలని తెలిపారు.

110 మందికి వైద్య పరీక్షలు



వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ వెంకయ్య

టంగుటూరు: టంగుటూరు పంచాయతీ పరిధిలోని వెంకటాయపాలెంలో స్ఫూర్తి స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో గౌరవ సలహాదారు, ఆదాయపన్ను శాఖ అసిస్టెంట్ కమిషనర్ బొడ్డు వెంకటేశ్వరరావు సహకారంతో ఉచిత వైద్య శిబిరాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రముఖ వైద్యుడు మాదాసి వెంకయ్య 110 మందికి వైద్య పరీక్షలు చేసి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

దీన్‌దయాళ్ ఉపాధ్యాయ చిరస్మరణీయుడు

గిద్దలూరు రూరల్: పండిట్‌దీన్ దయాళ్ ఉపాధ్యాయ ఎప్పటికి చిరస్మరణీయులని బీజేపీ నాయకులు పిడత రమేష్‌రెడ్డి అన్నారు. పండిట్ దీన్‌దయాళ్ వర్ధంతి సందర్భంగా పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో ఆదివారం ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ తన సిద్ధాంతాలను ప్రజలకు తెలియజేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు గుమ్మా రాముడు, దూదేకుల బాదుల్లా, తిరుపాల్‌రెడ్డి, ముహత్తార్ సుల్తానా పాల్గొన్నారు.

సత్తాచాటిన గిద్దలూరు విద్యార్థులు

గిద్దలూరు రూరల్: గుంటూరులో నిర్వహించిన సౌత్ టెన్నిస్ టోర్నమెంట్‌లో గిద్దలూరు విశ్వభారతి స్కూల్‌లో 8 వ తరగతికి చెందిన విద్యార్థిని భావనాదేవి, కుషీత్‌లు ప్రతిభ చూపి సత్తాచాటారు. ఈ సందర్భంగా వారిని గిద్దలూరు టెన్నిస్ కోర్టు అధ్యక్షుడు డా.రంగారెడ్డి, జి.కె.మోహన్ రెడ్డి, కోచ్ మురళిరెడ్డి అభినందనలు తెలిపారు.

అంతర్గత రోడ్లకు మరమ్మతులు

దొనకొండ: దొనకొండలోని ఎన్‌టీఆర్ కాలనీలో అంతర్గత రోడ్లు మరమ్మతులకు గురయ్యాయి. కాలనీవాసుల కోరిక మేరకు సర్పంచ్ కొంగలేటి గ్రేస్ రత్నకుమారి దేవానంద్ అంతర్గత రోడ్లకు మరమ్మతులు చేపట్టారు. నాలుగు రోడ్లు జేసీబీతో శుభ్రం చేసి గ్రావెల్ తోలి డోజర్‌తో చదును చేశారు. త్వరలో జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ సహకారంతో సిమెంట్ రోడ్లు వేయిస్తామని కాలనీవాసులకు సర్పంచ్ తెలిపారు. కాలనీవాసులు సర్పంచ్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

బాధ్యతలు స్వీకరించిన ఎస్సై అనిత

అర్ధవీడు (కంభం): స్థానిక పోలీసు స్టేషన్‌లో ఆదివారం నూతనంగా అర్ధవీడు ఎస్సైగా ఎం.అనిత బాధ్యతలు స్వీకరించారు. ఈమె బాపట్ల జిల్లా నుంచి బదిలీ పై ఇక్కడికి వచ్చారు. ఇక్కడ పని చేస్తున్న నాగమల్లేశ్వరరావు ఒంగోలు దిశ పోలీసు స్టేషన్‌కు బదిలీ అయ్యారు.

మిర్చి రైతుల ఆవేదన



నీలకంఠాపురం కల్లాల్లో ఎండబెట్టిన మిర్చి



తెగుళ్లతో దెబ్బతిన్న మిర్చి తోటలు

హనుమంతునిపాడు: మండలంలో 23 గ్రామ పంచాయతీలో అధికారుల లెక్కల ప్రకారం 200 ఎకరాల్లో మిర్చి సాగు చేశారు. ఈ ఏడాది తుఫాన్‌కు తోటలు బాగా దెబ్బతిన్నాయి. ఉన్నతోటలకు కుచ్చు తెగుళ్ల సోకాయి. దీంతో కొంత మంది రైతులు తెగుళ్ల అదుపు కాక తోటలను వదలివేశారు. తెగుళ్లతో దిగు బడి కూడా తక్కువస్తుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

గత ఏడాది ఎకరాకి దిగు బడి 15 క్వింటా నుంచి 20 క్వింటాల వరకు వచ్చిందని రైతులు వీరనారాయణ, వెంకటేశ్వర్లు అంటున్నారు. ఈ ఏడాది 10 నుంచి 12 క్వింటాలు మించి దిగు బడి వచ్చే అవకాశం లేదు. గుంటూరు మార్కెట్‌లో క్వింటాకి కాయ నాణ్యతను బట్టి రూ. 18 వేల నుంచి రూ. 20 వేలు ధర పలుకుతుందని రైతులు చెప్తున్నారు. తాలు కాయ క్వింటా రూ. 10 వేల నుంచి రూ. 11 వేల వరకు ధర ఉందని రైతులు తెలిపారు.

భక్తిశ్రద్ధలతో వాసవీమాత ఆత్మార్పణ దినోత్సవం



ప్రత్యేక అలంకరణలో వాసవీమాత మూలవిగ్రహమూర్తి



హోమం నిర్వహిస్తున్న భక్తులు



సామూహిక కుంకుమార్చనలో పాల్గొన్న భక్తులు

పామూరు: ఆర్యవైశ్య కులదేవత వాసవీమాత ఆత్మార్పణ దినోత్సవం ఆదివారం ఆర్యవైశ్యసంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వాసవీమాత ఆలయప్రాంగణంలో ఉదయం గణపతి హోమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆలయంలో రుత్వికులు రాయప్రోలు తులసీనాథ్, రాఘవ సుమంత్ వాసవీమాత మూలవిగ్రహమూర్తికి అభిషేకం నిర్వహించి ప్రత్యేకపూజలు చేశారు. అనంతరం స్థానిక సత్యనారాయణస్వామి దేవస్థానం వద్ద నుంచి ఆర్యవైశ్య మహిళలు మేళతాళాల నడుమ జ్యోతులతో ప్రదర్శనగా వాసవీమాత ఆలయానికి వచ్చారు. ఈసందర్భంగా ఆలయంలో కుంకుమార్చన, లలితాసహస్రపారాయణ చేశారు. దేవస్థాన కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. దేవస్థాన కమిటీ చైర్మన్ యేల్చూరి బాలకొండలరావు, విశ్వనాథుని మణికంఠ సత్యనారాయణ, దరిశి మస్తాన్‌రావు, సత్యనారాయణ, శేగు క్రిష్ణయ్య, కమిటీ సభ్యులు, ఆర్యవైశ్యమహిళలు, భక్తులు పాల్గొన్నారు.

గృహ నిర్మాణాలకు అనుమతులు తీసుకోవాలి



ఇంటి నిర్మాణాలు పరిశీలిస్తున్న చైర్మన్ అబ్దుల్ గఫార్

కనిగిరి రూరల్: నూతన నిర్మాణాలకు, కట్టడాలకు మున్సిపల్ అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలని మున్సిపల్ చైర్మన్ ఎస్కే అబ్దుల్ గఫార్ అన్నారు. పట్టణంలోని పదో వార్డులో ఆదివారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా చైర్మన్ గఫార్ మాట్లాడుతూ ఇంటి నిర్మాణదారులు తప్పనిసరిగా ప్లాన్ అప్రూవల్ తీసుకోవాలన్నారు. అక్రమణలు లేకుండా గృహాలను నిర్మించుకోవాలన్నారు. అనంతరం పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరూ వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతను పాటించాలని సూచించారు. స్థానిక నాయకులు ఎస్ ఎస్ రసూల్, మన్సూర్, సచివాలయ, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

నేడు వైఎస్సార్ ఆసరా పంపిణీ

పుల్లలచెరువు: మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో వైఎస్సార్ ఆసరా బహిరంగ సభ సోమవారం నిర్వహించనున్నట్లుగా వైఎస్సార్ క్రాంతి పథం ఏపీఎం వెంకటయ్య ఆదివారం ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు బహిరంగ సభ జరుగుతుందని, సమావేశానికి వైఎస్సార్ సీపీ సమన్వయకర్త తాటిపర్తి చంద్రశేఖర్ పాల్గొంటారని పేర్కొన్నారు. డ్వాక్రా గ్రూపు మహిళలు తరలిరావాలని తెలిపారు.

భక్తిశ్రద్ధలతో గోపూజ, మహా నివేదన



గోపూజ నిర్వహిస్తున్న అర్చకులు, పాల్గొన్న చైర్మన్, ఈఓ, భక్తులు

సీఎస్‌పురం(పామూరు): మండలంలోని ప్రఖ్యాత పుణ్యక్షేత్రం మిట్టపాలెం నారాయణస్వామి ఆలయంలో ఆదివారం గోపూజ, మహానివేదన అర్చకులు మహంకాళి ప్రసాదుశర్మ ఆధ్వర్యంలో వేదమంత్రాలతో నిర్వహించారు. ఈ సందర్భంగా నారాయణ స్వామి మూలవిగ్రహమూర్తికి పంచామృతాభిషేకం, విశిష్ట పూజలు చేశారు. అనంతరం గోవుకు శాస్త్రోక్తంగా అర్చకులు గోపూజ నిర్వహించారు. అనంతరం భజంత్రీల మేళతాళాల నడుమ మహా నైవేద్యంతో ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి పొంగలిని స్వామికి నైవేద్యంగా సమర్పించారు. దేవస్థాన కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు తీర్థప్రసాదాలు, అన్నప్రసాదం అందజేశారు. ఆలయ వ్యవస్థాపక చైర్మన్ కొమ్మినేని చిన్న ఆదినారాయణ, ఈఓ జి.రమణారెడ్డి, కొమ్మినేని వెంకట్రావు, ముదుమాల నారాయణరెడ్డి, ఎస్.వెంకటనారాయణ, భక్తులు, సిబ్బంది పాల్గొన్నారు.



మహానివేదనతో ప్రదక్షిణలు చేస్తున్న అర్చకులు, చైర్మన్, ఈఓ, భక్తులు

బాలోత్సవంలో విద్యార్థిని ప్రతిభ



బహుమతి అందుకుంటున్న విద్యార్థిని

చీమకుర్తి: ఒంగోలులో జరిగిన బాలోత్సవం కార్యక్రమంలో చీమకుర్తి మండలంలోని బండ్లమూడి జిల్లాపరిషత్ హైస్కూలు 7వ తరగతి విద్యార్థిని హర్షిత డ్రాయింగ్ పోటీల్లో ప్రతిభ ప్రదర్శించి ప్రథమ బహుమతి గెలుచుకున్నట్లు హెచ్‌ఎం కాంతారావు తెలిపారు. విద్యార్థిని హైస్కూలు ఉపాధ్యాయులు అభినందించారు.

కార్నియా దానం

అద్దంకి: పట్టణానికి చెందిన గనుపూడి నరేంద్ర తండ్రి వెంకటేశ్వర్లు మృతిచెందాడు. ఆయన కళ్లలోని కార్నియాను కుటుంబ సభ్యుల ఆమోదంతో చుండూరి రామారావు చారిటబుల్ ట్రస్ట్ సహకారంతో శంకర్ కంటి వైద్యశాల వైద్యులు కళ్లలోని కార్నియాను సేకరించి ఐ బ్యాంకు ఆదివారం అందజేశారు. ఒకరి నేత్రదానం ఇద్దరికి అంధులకు కంటి చూపు ప్రసాదిస్తుందని, మృరణించిన తరువాత కట్టెల్లో కాలిపోయో కళ్లను మరో ఇద్దరికి ఉపయోగపడే విధంగా దానం చేయించాలని శంకర్ కంటి వైద్యశాల వైద్యులు చెప్పారు.

రెండు ద్విచక్ర వాహనాలు ఢీ.. ముగ్గురికి గాయాలు

ముండ్లమూరు: మండలంలోని పెద ఉల్లగల్లు వద్ద ఆదివారం రెండు ద్విచక్ర వాహనాలు ఎదురెదురుగా ఢీకొనడంతో ముగ్గురికి గాయాలయ్యాయి. మండలంలోని కెల్లంపల్లి గ్రామానికి చెందిన దెయ్యాల రాణి, అచ్చయ్య, భార్యాభర్తలు ద్విచక్ర వాహనంపై దర్శి వైపు వెళ్తున్నారు. మార్గ మధ్యలో దర్శి - అద్దంకి ప్రధాన రహదారిలో పెద ఉల్లగల్లు వద్ద పసుపుగల్లు గ్రామానికి చెందిన వడియాల అబ్రహం ద్విచక్ర వాహనంపై దర్శి నుంచి స్వగ్రామం వస్తున్నాడు. రెండు ద్విచక్రవాహనాలు ఎదురెదురుగా ఢీ కొనడంతో ముగ్గిరికి గాయాలయ్యాయి. వారిని 108 వాహనంలో దర్శి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

రెండు ద్విచక్రవాహనాలు ఢీ

దర్శి (కురిచేడు): ఎదురెదురుగా వస్తున్న రెండు ద్విచక్రవాహనాలు ఢీకొని ఒకరికి గాయాలైన సంఘటన మండలంలోని రాజంపల్లి బీఈడీ కళాశాల వద్ద ఆదివారం సాయంత్రం చోటు చేసుకుంది. మండలంలోని తిమ్మాయిపాలెం గ్రామానికి చెందిన కోటేశ్వరరావు తన ద్విచక్రవాహనంపై పొదిలి వెళ్లి పనులు ముగించుకుని స్వగ్రామానికి తిరుగు ప్రయాణమయ్యాడు. రాజంపల్లి దాటగానే ఎదురుగా వస్తున్న ద్విచక్రవాహనం, కోటేశ్వరరావు ద్విచక్రవాహనం ఢీకొట్టుకున్నాయి. ఈ ఘటనలో కోటేశ్వరరావుకు ముక్కు, నోటి వెంట రక్తం వస్తుంది. తలలో ఇంటర్నల్‌గా దెబ్బలు తగిలి ఉండవచ్చని వైద్యులు అనుమానిస్తున్నారు. 108కి సమాచారం అందించటంతో సిబ్బంది శ్రావణి, కాజా మస్తాన్‌లు ప్రథమ చికిత్స చేసి మెరుగైన వైద్యం కోసం దర్శి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అక్కడ పరీక్షలు జరిపిన వైద్యులు ఒంగోలు రిమ్స్‌కు తరలించాలని సూచించటంతో 108లో ఒంగోలు తరలించారు.

వాసవీ కన్యకాపరమేశ్వరికి ప్రత్యేక పూజలు

ఒంగోలు మెట్రో: మాఘశుద్ధ విదియ ఆదివారం కన్యకాపరమేశ్వరీదేవి సర్వతా పూజలు అందుకుంది. ఒంగోలు గాంధీరోడ్డు అమలనాథుని వీధిలో కొలువై ఉన్న శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరి దేవస్థానంలో తదియ ఆరాధన సంఘం ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం ఏడు గంటలకు వాసవీ కన్యకాపరమేశ్వరి మూల విరాట్కు సుగంధ పరిమళ ద్రవ్యాలతో శ్రీ సూక్తంతో ఆలయ అర్చకులు ఫణిశర్మ అభిషేకం నిర్వహించారు. అనంతరం విజయవాడ వాస్తు వ్యుడు, వేదపండితుడు అంబటిపూడి మారుతీ ప్రసాద్‌శర్మ ఆధ్వర్యంలో చండీహోమం, పూర్ణాహుతి శాస్త్రోక్తంగా పరిసమాప్తమయ్యాయి. సాయంత్రం ఏడు గంటలకు వేణుగోపాలస్వామి భజనమండలి వారు శ్రీవాసవీ గానామృతాన్ని ఆలపించారు. స్థానిక మహిళలు పెద్ద సంఖ్యలో ఆలయానికి చేరుకుని అమ్మవారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో శ్రీ వాసవీ కోలాట భజన మండలి వారిచే కోలాటం, గుడి ఉత్సవం, రాత్రి తొమ్మిది గంటలకు నవహారతులతో వాసవీ అమ్మవారికి నీరాజనాలు సమర్పించారు.

ఘనంగా సరస్వతీ దేవి విగ్రహావిష్కరణ



సరస్వతీ దేవి విగ్రహావిష్కరణలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

జరుగుమల్లి: మండల కేంద్రమైన జరుగుమల్లిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో ఆదివారం పూర్వ విద్యార్థులు సరస్వతీ దేవి విగ్రహాన్ని ఆవిష్కరించారు. 1980–81 పదో తరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థుల సహకారంతో సరస్వతి దేవి విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. పలు ప్రభుత్వ శాఖల్లో పని చేస్తున్న పూర్వ విద్యార్థులు చిన్ననాటి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు.

శిల్పికి జాతీయ పురస్కారం

కంభం: పట్టణానికి చెందిన వేముల తిరుపతి ఆచారి అయోధ్య బాలరాముడికి పాదుకలు తయారు చేసినందుకు గాను ఆదివారం విజయవాడలో తెలుగు సంస్కృతి ట్రస్టు వారు జాతీయ పురస్కారం అందజేశారు. అవార్డును అందజేసిన వారిలో పిట్టంపల్లె రామలింగాచారి, విశ్వబ్రాహ్మణ సంఘం మాజీ అధ్యక్షుడు శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

వెంకటరామిరెడ్డి మృతికి దద్దాల సంతాపం



వెంకటరామిరెడ్డి మృతదేహానికి నివాళులర్పిస్తున్న నియోజకవర్గ ఇన్‌చార్జ్ దద్దాల

వెలిగండ్ల: మండలంలోని కంకణంపాడు పంచాయతీ అగ్రహారంలో మాజీ సర్పంచ్ శ్యామల వెంకటరామిరెడ్డి అనారోగ్యంతో శనివారం రాత్రి మృతి చెందారు. రామగోపాలపురం గ్రామానికి చెందిన దండగ నరసమ్మ అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న కనిగిరి వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ దద్దాల నారాయణయాదవ్, జెడ్పీటీసీ సంఘం జిల్లా అధ్యక్షుడు గుంటక తిరుపతిరెడ్డి, మాజీ జెడ్పీటీసీ రామన తిరుపతిరెడ్డి ఆదివారం మృతి చెందిన వారి మృతదేహాలను సందర్శించి నివాళులర్పించారు. వారి కుటుంబాలకు సంతాపం వ్యక్తం చేశారు. వైఎస్సార్ సీపీ నాయకులు వై నాగూర్‌యాదవ్, టి.దేవసహాయం, కటికల వెంకటరత్నం, మారం వెంకటేశ్వరరెడ్డి, లక్ష్మీనారాయణ రెడ్డి, వె వెంకట్రామయ్య లు పాల్గొన్నారు.

దీన్ దయాళ్‌కు ఘన నివాళి



పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న బీజేపీ నేతలు

కందుకూరు: పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ వర్ధంతిని పురస్కరించుకుని స్థానిక భారతీయ జనతా పార్టీ నాయకులు స్థానిక కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నియోజకవర్గ సమన్వయకర్త ఘట్టమనేని హరిబాబు మాట్లాడుతూ ఏకాత్మత మానవతావాద సిద్ధాంతాన్ని ప్రవేశపెట్టి స్వాతంత్ర ఫలాలను అట్టడుగు వర్గాలకు చేర్చడమే ప్రథమ కర్తవ్యంగా భావించాలని కోరిన మహోన్నత వ్యక్తి దీన్‌దయాళ్ ఉపాధ్యాయ అన్నారు. ఆయన ఆశయాలను నెరవేర్చే దిశగా ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం పనిచేస్తుందని, పేదల అభ్యున్నతికి అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెడుతుందని వివరించారు. దేశ అభివృద్ధికి అన్ని విధాల పాటు పడుతుందని చెప్పారు. కో కన్వీనర్ జొన్నాదుల సురేష్, పట్టణ అధ్యక్షుడు మన్నేపల్లి వరప్రసాదరావు, రూరల్ అధ్యక్షుడు చల్లా వెంకట రాజా, ఎస్టీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు వైకుంఠం జగన్నాథం, బొర్రా కోటేశ్వరరావు, అమలనాథుని మాల్యాద్రినాయుడు, ఓబీసీ మోర్చా పట్టణ అధ్యక్షుడు మాటూరి రమేష్‌నాయుడు, సోషల్ మీడియా బాధ్యులు శివ మహేశ్వరరావు, సీనియర్ నాయకులు కవర్తపు మల్లికార్జునరావు, గొడ్డటి బాలరాఘవులు, అజయ్ రెడ్డి, కృష్ణచైతన్య పాల్గొన్నారు.

బాలకోటయ్య మృతి పార్టీకి తీరని లోటు



బాలకోటయ్య మృతదేహానికి నివాళులర్పిస్తున్న నేతలు

కందుకూరు: పట్టణంలోని శ్రీరామకాలనీ సచివాలయం పరిధిలో వైఎస్సార్ సీపీ గృహసారధిగా పనిచేస్తున్న కలిశెట్టి బాలకోటయ్య ఆకస్మిక మృతి పార్టీకి తీరని లోటని జేసీఎస్ కో ఆర్డినేటర్ ముప్పవరపు కిశోర్ అన్నారు. ఆదివారం బాలకోటయ్య మృతదేహాన్ని సందర్శించి నివాలులర్పించారు. ఆది నుంచి బాలకోటయ్య వైఎస్సార్ సీపీలో కార్యకర్తగా కొనసాగుతూ, మానుగుంట మహీధర్‌రెడ్డి వెంట నడుస్తున్నారని చెప్పారు. పార్టీ పటిష్టత కోసం తనవంతు కృషి చేశారని చెప్పారు. బాలకోటయ్య మృతి వార్త తెలుసుకున్న ఎమ్మెల్యే మానుగుంట మహీధర్‌రెడ్డి ఆ కుటుంబానికి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేసినట్లు తెలిపారు. నివాళులర్పించిన వారిలో సచివాలయ కన్వీనర్లు దేవరకొండ ఆదిలక్ష్మి, చనమాల కోటేశ్వరరావు, వాలంటీర్ సతీష్‌కుమార్, అచ్చమ్మ తదితరులు ఉన్నారు.

14న న్యాక్ బృందం పరిశీలన

కందుకూరు రూరల్: కందుకూరు టీఆర్‌ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలను న్యాక్ బృందం ఈ నెల 14, 15వ తేదీల్లో పరిశీలించనున్నట్లు ప్రిన్సిపాల్ ఎం.రవికుమార్ తెలిపారు. న్యాక్ బృందం కళాశాలలోని వసతులు, బోధనా పద్ధతులను పరిశీలిస్తుందన్నారు. అదే విధంగా 14వ తేదీ మధ్యాహ్నం రెండు గంటల నుంచి పూర్వ విద్యార్థులు చెప్పే అభిప్రాయాలను అత్యంత విలువైందిగా పరిగణించి కళాశాల గ్రేడ్‌ను నిర్ణయించే అవకాశం ఉందన్నారు. కావున 14వ తేదీ మధ్యాహ్నం రెండు గంటలకు న్యాక్ బృందంతో జరిగే సమావేశంలో కళాశాల పూర్వ విద్యార్థులు పెద్ద ఎత్తున పాల్గొని కళాశాలకు అభివృద్ధికి గ్రేడ్ రావడానికి సహకారం అందించాలని ప్రిన్సిపాల్ కోరారు.

నాయబ్‌రసూల్‌కు డాక్టరేట్



డాక్టరేట్ అందుకుంటున్న స్వయంకృషి స్వచ్ఛందసేవాసంస్థ అధ్యక్షుడు నాయబ్‌రసూల్

పామూరు: పామూరుకు చెందిన స్వయంకృషి స్వచ్ఛందసేవా సంస్థ అధ్యక్షుడు షేక్.నాయబ్‌రసూల్‌ను డాక్టర్‌రేట్ వరించింది. ఈసందర్భంగా ఆదివారం చెన్నైలో భారతీయ విద్యాభవన్‌లో జరిగిన కార్యక్రమంలో స్వచ్ఛంద సేవాసంస్థ ద్వారా గత సమారు 15 ఏళ్లగా సేవాకార్యక్రమాలు నిర్వహించగా ఆ సేవలకు గుర్తింపుగా డాక్టరేట్‌కు ఎంపికైన షేక్ నాయబ్‌రసూల్‌కు గ్లోబల్ హ్యూమన్ పీస్ యూనివర్సిటీ చైర్మన్ డాక్టర్ పి.మనుయెల్, తమిళనాడు జడ్జి కె.వెంకటేశన్, తమిళనాడు ప్రిన్సిపల్ సెక్రటరీ దర్మేంద్ర ప్రతాప్‌యాదవ్, తమిళనాడు రిటైర్డ్ స్పెషల్ కమిషనర్ కే.సంపత్‌కుమార్, డాక్టర్ జయమహేష్‌ల చేతులమీదుగా నాయబ్‌రసూల్ డాక్టరేట్ అందుకున్నారు.

అల్లూరి పోలేరమ్మ తల్లికి ప్రత్యేక పూజలు

మార్కాపురం టౌన్: మార్కాపురం పట్టణ శివారులోని అల్లూరి పోలేరమ్మ ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకుడు వెంకటేశ్వర్లు అమ్మవారిని ప్రత్యేకంగా అకంకరించి, కుంకుమార్చన, అభిషేకాలు చేశారు. ఆలయ ఆవరణలోని పుట్ట, నాగ శిలలకు ప్రత్యేక పూజలను భక్తులు నిర్వహించారు. భక్తులు ఆలయ ప్రాంగణంలో పొంగళ్లు వండి అమ్మవారికి నైవేద్యంగా సమర్పించారు. భక్తులకు ఏర్పాట్లను ఆలయ ఈవో చెన్నకేశవరెడ్డి, ధర్మకర్తలు, ఆలయ సిబ్బంది శ్రీధర్‌రెడ్డి తదితరులు పర్యవేక్షించారు.